క్లుప్తంగా

మోర్లవారిపాలెంలో పారిశుద్ధ్యం పనులు



రేపల్లె: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత ముఖ్యమని సర్పంచ్ యార్లగడ్డ లక్ష్మీతిరుపతమ్మ అన్నారు. మిచాంగ్ తుపాను నేపథ్యంలో మండలంలోని మోర్లవారిపాలెం పంచాయతీలో ఆదివారం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. రహదారుల వెంబడి చెత్తను తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. కచ్చా డ్రెయిన్‌లలో పూడిక తీయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సెమీక్రిస్మస్ వేడుకలు

మూల్పూరు(వేమూరు): పాపులను రక్షించేందుకు ఏసుక్రీస్తు జన్మించడం జరిగిందని గ్రేస్ ఫౌండేషన్ అధినేత కై తేపల్లి షాలేం రాజు అన్నారు. అమర్తలూరు మండలం మూల్పూరు గ్రామంలో శనివారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రిస్మస్ స్టార్ వెలిగించారు. గ్రామంలో లూథరన్ చర్చి మరమ్మతుల కోసం గ్రామస్తులకు రూ.1.25లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బందేల సురేష్, నల్లూరు రవి, పచ్చిగళ్ల అనిల్, ఎలిచర్ల సురేష్, నల్లూరు సురేష్ పాల్గొన్నారు.

మట్టి ఖర్చులు అందజేత



భట్టిప్రోలు: భట్టిప్రోలుకు చెందిన చింతగింజల వెంకట గిరి (35), పల్లెకోనకు చెందిన పులివర్తి పిచ్చమ్మ(70) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. వీరి కుటుంబాలకు గ్రేస్ ఫౌండేషన్ ఆపన్నహస్తం అందించింది. ఫౌండేషన్ చైర్మన్ కై తేపల్లి షాలేమ్ రాజు వారికి మట్టి ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పెదపులివర్రులో సహస్ర దీపోత్సవం



పెదపులివర్రు(భట్టిప్రోలు): పెదపులివర్రు గ్రామంలోని వరదరాజస్వామి అంతర్భాగ రామాలయంలో శనివారం రాత్రి సహస్ర దీపోత్సవం నిర్వహించారు. బాల త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్ర స్వామి స్వామికి 28వ రోజు ఆదివారం ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. గ్రామ దేవత గోగులమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు పర్యవేక్షిస్తున్నారు.

నిత్యావసరాల పంపిణీ

చావలి(వేమూరు): మిచాంగ్ తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు గాజుల బాను ప్రకాశ్ తెలిపారు. ముంపునకు గురైన మండలంలోని చావలి దళిత కాలనీలోని కుటుంబాలకు 25కిలోల బియ్యం, కంది పప్పు, నూనె చొప్పున అందజేసినట్లు చెప్పారు. వీఆర్వో మదన్ మోహన్ ఉన్నారు.

తుఫాను బాధితులకు దుప్పట్లు, చీరలు పంపిణీ



బాపట్ల అర్బన్: బాపట్ల పట్టణంలోని మూడో వార్డు రాజీవ్‌గాంధీ కాలనీలో తుపాను బాధితులకు భారత సేవ శ్రమ సంఘం సభ్యులు ఆదివారం దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. పేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని మణీశ్వర్ ఆనంద్ స్వామిజీ కోరారు. కంకటపాలెం గ్రామంలో యానాదులకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సబ్బినేని కిషోర్ , వడ్లమూడి వెంకటేశ్వరరావు, మద్దిబోయిన భవనారాయణ పాల్గొన్నారు.

సూర్యలంక తీరంలో వ్యక్తి గల్లంతు

బాపట్ల అర్బన్: సూర్యలంక సముద్ర తీరంలో ఆదివారం విషాదం నెలకొంది. సముద్ర స్నానానికి వచ్చిన ఓ వ్యక్తి గల్లంతయ్యాడు. గల్లంతైన వ్యక్తి కోసం తీరంలో ఉన్న గజ ఈతగాళ్లు ఎంత ప్రయత్నించినా ఆచూకీ లభించలేదు. ఎక్కడ నుంచి వచ్చింది తెలియదని, ఒక్కడే వచ్చినట్లు అర్థమైందని మెరైన్ పోలీసులు అంటున్నారు.

కార్తిక మాసం..వెల్లివిరిసిన భక్తిభావం

- దేదీప్యమానంగా ఆలయాలు
- భక్తిశ్రద్ధలతో కార్తిక మాసం చివరి ఆదివారం పూజలు
- ఆనందంగా కార్తిక వన సమారాధనలు
- సూర్యలంక తీరంలో భారీ అన్నదానం

కార్తిక మాసం చివరి ఆదివారం భక్తిభావం వెల్లివిరిసింది. పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయాల్లో కార్తిక దీపాలు వెలిగించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ కుల సంఘాల వన సమారాధనలు ఆనందంతో నిండిపోయాయి. బాపట్ల సూర్యలంక సముద్ర తీరంలో అఖండ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన భారీ అన్నదానాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించారు. అన్నదానం ప్రాముఖ్యతను వివరించారు.



సూర్యలంక తీరంలో అన్నదానం ప్రారంభించిన ఎమ్మెల్యే కోన రఘుపతి



దీపోత్సవంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ సీతారామిరెడ్డి



విద్యా ప్రోత్సాహకాలను అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్



పూజా కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు



అన్నదానం చేస్తున్న ఎంపీపీ శ్రీకృష్ణయ్య

బాపట్ల: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అని ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. కార్తిక మాసం ఆదివారం సూర్యలంక సముద్రతీరంలో పుణ్య స్నానాలాచరించేందుకు వచ్చే భక్తుల కోసం అఖండ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాదాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్తిక మాసంలో పుణ్యస్నానాలాచరించి స్థానిక శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు చేసే భక్తుల ఆకలిని తీర్చేందుకు అఖండ ఫౌండేషన్ అధ్యక్షుడు విన్నకోట సురేష్ ఆరు వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పించిందని కోన చెప్పారు. అనంతరం విన్నకోట సురేష్ ఎమ్మెల్యే కోన రఘుపతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో అఖండ ఫౌండేషన్ కళ్లం హరనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా వీరారెడ్డి, కొక్కిలగడ్డ చంచయ్య, ఫౌండేషన్ సభ్యులు వంగపాటి శివ, చేజర్ల సతీష్, ఆరుమళ్ల సుధాకర్‌రెడ్డి, చీమలదిన్నె నారాయణ, ఆంజనేయ ప్రసాద్, ముప్పిరి నాగరాజు, వీరేష్, రామాంజనేయకుమార్ తదితరులు ఉన్నారు.

విద్యావ్యాప్తితో ఆర్థికాభివృద్ధి సాధ్యం

బాపట్ల: విద్యావ్యాప్తితో ఆర్థికాభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ పేర్కొన్నారు. కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు, విద్యార్థులకు ప్రోత్సాహకాలను సూర్యలంకలో ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఒకరు ఉన్నత చదువులు చదువుకోవటం వల్ల ఆ కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందుతుందన్నారు. వృద్ధాశ్రమ పనులు వచ్చే ఏడాదికి పూర్తవుతాయన్నారు. ఈ సందర్భంగా 417మంది విద్యార్థులకు రూ.12.44లక్షల ప్రోత్సాహకాలతో పాటు వితంతువులు 16 మందికి కుట్టు మిషన్లు, గ్రైండర్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాపు సేవా సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు, మున్సిపల్ మాజీ చైర్మన్లు నరాలశెట్టి ప్రకాశరరావు, జిట్టా ప్రమీలారాణి, వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ, నాయకులు తులసి కుమారి, తాండ్ర సాంబశివరావు, వెంకటేశ్వరమ్మ, కాపు సేవా సంఘం సభ్యులు పర్వతరెడ్డి భాస్కరరావు, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, తులసి సాయిదాసు, మారిశెట్టి రాఘవరావు, తోట రామాంజనేయులు, తోట బాబీ, ఇనపగోళ్ళ రంగారావు, కోటికలపూడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోటి దీపోత్సవం

కొత్తనందాయపాలెం(కర్లపాలెం): కార్తిక మాసంను పురస్కరించుకుని కొత్తనందాయపాలెంలోని కోదండరామస్వామి ఆలయంలో కోటి ఒత్తుల దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో కార్తిక దీపాలు వెలిగించారు. ఆలయం వద్ద అన్న సంతర్పణ చేశారు. ఏఎంసీ చైర్మన్ దొంతిబోయిన సీతారామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు, గ్రామ కమిటీ అధ్యక్షుడు రావి అంజిరెడ్డి, నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, మందపాటి పరమానందకుమార్, తిరుపాల్‌రెడ్డి, ఏవీ రెడ్డి పాల్గొని, పూజలు చేసి ప్రసాదాలు స్వీకరించారు.

పద్మశాలీయ కార్తిక వన సమారాధన

భట్టిప్రోలు: మార్కండేయ పద్మశాలీయ బహుత్తమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక టీఎంరావు హైస్కూల్‌లో కార్తిక వనసమారాధన జరిగింది. ఈ సమారాధనకు కొతరపు వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం కుమారులు రవీంద్రబాబు, బాల గంగాధర్ పట్టినన్ని బియ్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి–బాలాజీ, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి–నాగమల్లేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. సమారాధనలో సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. 3 వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బ్రాహ్మణ కార్తిక వన సమారాధన

భట్టిప్రోలు: శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానంలో శ్రీ సాయి కృష్ణ కళావేదిక ఆవరణలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు ఏకాదశ రుద్రాభిషేకం, బ్రహ్మశ్రీ పాతూరి కాంతారామ శర్మ శాస్త్రోక్తంగా జరిపారు. వేణుగోపాల స్వామికి సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చనలను అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు నిర్వహించారు. బ్రహ్మశ్రీ ముద్దా లీలామోహనరావు, దీవి వేంకట నరసింహాచార్యులు, కూచిబొట్ల శ్రీనివాసమూర్తి, కృష్ణ కిషోర్‌ల ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఆకట్టుకున్నాయి. సేవా సమితి నిర్వాహకులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

కాపు కార్తిక వనసమారాధన

నగరం: స్నేహపూర్వక వాతావరణానికి కార్తిక వన సమారాధనలు దోహదపడతాయని ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య అన్నారు. స్థానిక పక్కలమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన కాపు వన సమారాధనలో ఎంపీపీ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీని పక్కలమ్మ తల్లి కమిటీ సభ్యులు సత్కరించారు. తొలుత సత్యనారాయణ స్వామి వత్రాన్ని శాస్త్రయుక్తంగా జరిపారు. అనంతరం అన్నదానం చేశారు. సర్పంచ్ ఇంకోల్లు రామకృష్ణ, మత్తి రవికుమార్, కాపు సంఘ నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప శరణఘోషతో మార్మోగిన రేపల్లె



వేల్ ధరించి ర్యాలీగా వస్తున్న భక్తులు

రేపల్లె రూరల్: పట్టణంలోని స్వయంభూ రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి వేల్ పూజా కార్యక్రమం కనుల పండువగా జరిగింది. గురుస్వామి అలపాటి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన పంచ మండపాల పడిపూజ వైభవంగా నిర్వహించారు. అరటి మట్టలతో పంచ మండపాలను ఏర్పాటు చేసి, అయ్యప్పస్వామిని కొలువుదీర్చారు. స్వామికి పంచామృతాలు, పండ్ల రసాలు, పువ్వులతో అభిషేకాలు నిర్వహించారు.తొలుత అయ్యప్పస్వామి మాలధారులు ఓల్డ్ టౌన్‌లోని ఉమా మహేశ్వరస్వామి ఆలయంలో వేల్‌ను ధరించారు. అయ్యప్పస్వామిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో నెలకొల్పి, పుర వీధుల్లో ర్యాలీగా రామలింగేశ్వరస్వామి ఆలయానికి చేరుకున్నారు. ఆవరణంలో భక్తులు అయ్యప్పస్వామి భజనలు, భక్తి గీతాలను ఆలపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

హక్కులకు భంగం కలిగించకూడదు

పారా సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ తురకా మంగయ్య



మానవ హక్కుల ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు: ఎదుటి వారి హక్కులకు భంగం కలగకుండా జీవించడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని పారా సంస్థ జిల్లా కో–ఆర్డినేటర్ తురకా మంగయ్య అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఆదివారం పారా సంస్థ ప్రతినిధులు యనమదల రాజీవ్‌నగర్ కాలనీలో బాలలతో సమావేశం నిర్వహించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులు, వాటి సాధనకు ఏం చేయాలో వివరించారు. మంగయ్య మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి 1948 డిసెంబర్ 10న విశ్వ మానవ హక్కుల ప్రకటన చేసిందన్నారు. కుల, మత, వర్ణ, లింగ, ప్రాంతం, వృత్తి, వయో భేదం కారణంగా ఏ వ్యక్తినీ తక్కువగా చూడకూడదని తెలిపారు. అంతేకాకుండా ఒక వ్యక్తి మరొక వ్యక్తి సమగ్ర అభివృద్ధిని ఆటంకపరిచినా మానవ హక్కుల ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. అందరికీ జీవించే హక్కు, రక్షణపొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, భాగస్వామ్య హక్కు, గౌరవం పొందే హక్కు, స్వేచ్ఛా హక్కు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ తమ హక్కులను తెలుసుకుని, ఎదుటి వారిని గౌరవించాలని కోరారు. బాధ్యతగా నడుచుకున్నప్పుడు హక్కుల ఉల్లంఘనలు జరగవని సూచించారు. అందరం కలిసి మెలిసి వుంటాం, ఎవరి హక్కులకూ భంగం కలగకుండా జీవిస్తాం, మా హక్కుల్ని సాధించుకుంటాం .. అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. పాఠశాలల విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరంలో మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

కొల్లూరు: స్థానిక కాకతీయ కల్యాణ మండపంలో విజయవాడ హెల్ప్ వైద్యశాల ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్ సహకారంతో వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ప్రారంభించారు. శిబిరంలో 220 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మరో 35 మంది రోగులను మెరుగైన వైద్య పరీక్షల కోసం విజయవాడ వైద్యశాలకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, మాజీ ఎంపీపీ కనగాల మధుసూదన్ ప్రసాద్, సుగ్గునలంక సర్పంచ్ శీలం అంకమ్మరావు, కొల్లూరు వైస్ సర్పంచి దూళిపూడి కృష్ణ, వేమూరు మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్ శిగిలిశెట్టి రాఘవరావు పాల్గొన్నారు.

మానవ హక్కులతో సాధికారత



గోడ పత్రికలను ఆవిష్కరించిన సాయిబాబు

బాపట్ల: మానవ హక్కులు ప్రజలకు సాధికారతను ప్రసాదిస్తాయని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. 75వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం గోడ పత్రికలను ఆదివారం ఆవిష్కరించారు. అంతర్జాతీయంగా ఐక్యరాజ్యసమితి 1948 డిసెంబరు 10న మానవ హక్కుల సార్వత్రిక ప్రకటనను విడుదల చేసిందని సాయిబాబు తెలిపారు. మానవులందరికీ సమాన గౌరవం, సమాన ప్రతిపత్తి లభిస్తాయని చెప్పారు. వెట్టిచాకిరి, బానిసత్వం వంటి ఇతర వివక్షలకు గురవకుండా ఉండే హక్కు మానవులందరికి ఉందని తెలిపారు. న్యూస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చర్మవ్యాధులను నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న డాక్టర్ అమర్

గుంటూరు మెడికల్: చర్మవ్యాధులు ప్రాణాంతకం కాకపోయినా, జీవన విధానం, పనితీరుపై ప్రభావం చూపుతాయని వైద్య నిపుణులు డి. అమర్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని ఎస్‌హెచ్‌వో భవనంలో ఆదివారం ఎస్‌హెచ్‌వో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత చర్మవ్యాధుల వైద్య శిబిరంలో డాక్టర్ అమర్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎస్‌హెచ్‌వో అధ్యక్షుడు డాక్టర్ టి.సేవకుమార్ సారథ్యం వహించారు. డాక్టర్ అమర్ మాట్లాడుతూ మధుమేహ బాధితుల్లో బ్యాక్టీరియా, వైరల్, ఫంగల్ చర్మవ్యాధులు ఎక్కువగా వస్తాయని తెలిపారు. ముఖ్యంగా శరీరంలో తేమ ఎక్కువగా ఉండే ప్రాంతాలైన చంకలు, గజ్జలు, ప్రత్యుత్పత్తి అవయవాలు, కాలి వేళ్ల మధ్యలో చర్మవ్యాధులు ఎక్కువగా కనిపిస్తాయని చెప్పారు. అన్ని రకాల చర్మ వ్యాధులకు ఆయింట్మెంట్లు మాత్రమే పని చేయవని వెల్లడించారు. స్టెరాయిడ్స్ ఉన్న ఆయింట్మెంట్లను వైద్యుని సలహా లేకుండా అసలు వాడకూడదని సూచించారు. ఏ మందు ఏ చర్మ వ్యాధికి సమర్థంగా పనిచేస్తుందో వైద్యుల ద్వారా తెలుసుకుని వాడాలని తెలిపారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మెడికల్ క్యాంప్స్ చైర్మన్ టి.ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు చర్మవ్యాధులకు అంతగా ప్రాధాన్యత ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, వీటి ప్రభావం జీవన సరళిపై పడుతుందని తెలిపారు. డాక్టర్ టి. సేవ కుమార్ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌వో హైపర్ టెన్షన్ అండ్ డయాబెటిక్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో ఆదివారం ఒక స్పెషలిస్ట్‌తో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు టి.ఉమామహేశ్వరరావు, చావ శివాజీ పాల్గొన్నారు.

రేపట్నుంచి దశావతార కల్యాణ మహోత్సవాలు



ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి దశావతార కల్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు గజవల్లి వెంకటప్పారావు తెలిపారు. ఆదివారం ఆలయంలో ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరించారు. 12 నుంచి 21వ తేదీ వరకు దశ అవతారాలలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు జరుగుతాయన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు సుదర్శన హోమం, స్వామివారి కల్యాణం, తీర్థ ప్రసాదం పంపిణీ జరుగుతుందన్నారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు బంగారు దక్షిణవృత శంఖం ద్వారా తీర్థ ప్రసాదాలు అందజేయటం జరుగుతుందన్నారు. 23న ఉదయం స్వామివారి ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మాజీ సర్పంచ్ యర్రంశెట్టి వేణుగోపాల్ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు మైనర్ల అప్పగింత

చెరుకుపల్లి: గ్రామంలో అనుమానంగా సంచరించుతున్న ముగ్గురు యువకులను స్థానికులు పట్టుకుని, పోలీసులకు అప్పగించిన ఘటన ఆదివారం జరిగింది. స్థానిక ఎస్సై వై.సురేష్ కథనం మేరకు.. పొన్నూరుకు చెందిన ముగ్గురు మైనర్లు జంగు పిల్లుల వేట సాగిస్తూ.. కొన్ని రోజులుగా చెరుకుపల్లి పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ముగ్గురి తల్లిదండ్రులను పిలిపించి, వారికి అప్పగించినట్లు ఎస్సై చెప్పారు.

వివాహితతో అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

కర్లపాలెం: వివాహిత పట్ల ఓ వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించడంపై కేసు నమోదయ్యింది. కర్లపాలెం ఎస్‌ఐ ఎం.శివయ్య వివరాల మేరకు.. పెదగొల్లపాలెం పంచాయతీ గాంధీనగర్ కాలనీకి చెందిన మసనం కమలాకర్‌రావు ఈ నెల 4న రాత్రి అదే గ్రామానికి చెందిన ఓ వివాహిత చేయి పట్టుకుని అసభ్యంగా ప్రవర్తించాడని తెలిపారు. తొలుత ఆమె గ్రామపెద్దలను ఆశ్రయించినా న్యాయం జరగకపోవటంతో తమకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పొన్నూరులో బంద్ ప్రశాంతం



అంబేడ్కర్ విగ్రహం వద్ద పోలీసులు


పొన్నూరు: పట్టణంలో అంబేడ్కర్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎం. శ్రీనివాసరావు అనే వ్యక్తి అవమానకరంగా ప్రవర్తించిన ఘటనకు నిరసనగా దళిత సంఘాలు ఆదివారం నిర్వహించిన బంద్ ప్రశాతంగా సాగింది. పలువురు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా తిరిగాయి. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. ముందస్తుగా దళిత సంఘాల నాయకులను గృహ నిర్బంధం చేశారు. ఈ ఘటనపై యువతను రెచ్చగొట్టే విధంగా చేసే కార్యకలాపాలు సాగించే వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుమారు 400 మంది పోలీసులు పట్టణ వ్యాప్తంగా మోహరించారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు, పోలీసులు పాల్గొన్నారు.

పొన్నూరు ఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలి



ఆలపాడు(వేమూరు): పొన్నూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానించిన శ్రీనివాసరరావు అనే వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యూత్ ఆదివారం డిమాండ్ చేసింది. చుండూరు మండలం ఆలపాడు గ్రామంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు ధర్నా చేశారు. అంబేడ్కర్ విగ్రహాలుపై దాడులు చేస్తున్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



పట్టాల వెంబడి ఉన్న మృతదేహం

తెనాలిరూరల్: రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెనాలి రైల్వే స్టేషన్ వద్ద ఫ్లైఓవర్ వంతెన సమీపంలో (మొండి గోడలు) పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని గుర్తించారు. మృతుడు రైలు నుండి జారి పడి ఉంటాడని భావిస్తున్నారు. పసుపు రంగు టీషర్టు, సిమెంటు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. రాజస్థాన్‌కు చెందిన వాడై ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కరుణామయి ప్రార్థన మందిరంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ వేడుకల్లో వాక్య సందేశమిస్తున్న పాస్టర్ చంద్రబాబు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని కొమ్మమూరు కాల్వకట్ట సమీపంలో ఉన్న కరుణామయి ప్రార్థనా మందిరంలో ఆదివారం సెమి క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. సంఘ కాపరి ఎం.చంద్రబాబు ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ఎబిఎం చర్చి కాపరి పాస్టర్ ఎస్.సురేష్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొన్నెకల్లు సంఘ కాపరి పి.జాన్‌పాల్ క్రిస్మస్ సువార్త సందేశం అందజేశారు. వృద్ధులకు దుప్పట్లు, చీరలు సంకా రాధాకృష్ణ దంపతులు పంపిణీ చేశారు. ఏబీఎం సంఘ ప్రెసిడెంట్ సుద్దపల్లి శరత్ వెంకయ్య, పాస్టర్‌లు గద్దం జాన్‌బాబు, యోబు, అజయ్‌బాబులు వాక్యసందేశం ఇచ్చారు. సంఘకాపరి చంద్రబాబు, పాస్టర్‌లు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. కార్యక్రమాన్ని సుద్దపల్లి మురళీధర్, సొపాటి మోజెలు పర్యవేక్షించారు. మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో చేరడం వల్ల ఎన్నో ప్రయోజనాలు



మెడల్స్ అందుకున్న విద్యార్థినులతో ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ

తెనాలిఅర్బన్: ఎన్‌సీసీలో చేరడం వలన ఆత్మరక్షణతో పాటు ఉద్యోగావకాశాల్లో రిజర్వేషన్ లభిస్తుందని జేఎంజే కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ షైనీ, ఎన్‌సీసీ అధికారిణి డాక్టర్ ఉషాక్రాంతి పేర్కొన్నారు. జాతీయ ఎన్‌సీసీ దినోత్సవాన్ని జేఎంజే కళాశాలలో ఆదివారం నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు వివిధ రకాల మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్‌టేకర్ వై.శారాసూసన్, పలువురు ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.

కఠెవరంలో కనుల పండువగా కొలుపులు



కఠెవరం(తెనాలి): రూరల్ మండల గ్రామం కఠెవరంలో వేంచేసి ఉన్న శ్రీదుర్గమ్మ తల్లి దేవస్థానం వద్ద ఆదివారం అమ్మవారి కొలుపుల మహోత్సవాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. వేకువజామునే భక్తులు కనకతప్పెట్లు, మేళతాళాల మధ్య ఊరేగింపుగా పొంగళ్లు, చద్దినైవేద్యాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ అర్చకుడు నల్లగొర్ల శివయ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నవితరణ చేశారు. సాయంత్రం గ్రామంలో ఏర్పాటుచేసిన విద్యుత్ ప్రభ ఊరేగింపు ఆకర్షణీయంగా సాగింది.